sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 26-09-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 158 EDITOR: ROHINI

అరెస్టుతోనే నేరస్థుడా?

నేరం నిరూపణ కాక ముందే బేడీలు

- ట్రయల్ ముందే... జీవితం బూడిదే!
- తీర్పు ఇవ్వక ముందే సోషల్ మీడియా శిక్ష
- ఫోటోలు ఇచ్చి పరువు తీస్తున్న పోలీసులు
- హక్కుల ఉల్లంఘన... విచారణ ప్రహసనం!
- సుప్రీంకోర్టు ఆగ్రహం... పోలీసులకు చెక్!

ఎవరైనా ఒక కేసులో అరెస్ట్ కాగానే వారి చేతులకు సంకెళ్లు వేసి... పోలీసుల మధ్య నిలబెట్టి తీసిన వారి ఫోటోలను సోషల్ మీడియాలో, టీవీల్లో చూపించడం కరెక్టేనా? ఒక్క క్షణం ఆలోచించండి... ఇంకా కోర్టులో నేరం రుజువు కాకముందే వారి ఫోటోలను ఇలా బయటకు వదలడం ఎంతవరకు న్యాయం? ఒకవేళ విచారణ ముగిశాక ఆ వ్యక్తి నిర్దోషి అని తేలితే, ఇప్పటికే సమాజంలో పోయిన వారి పరువును తిరిగి ఇవ్వగలమా? ఈ అంశంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై ప్రత్యేక కథనం. - సహనం వందే, హైదరాబాద్

మన దేశంలో ఏ వ్యక్తి అయినా కోర్టు ద్వారా నేరస్థుడిగా తేలే వరకు అతడిని నిర్దోషిగానే పరిగణించాలని చట్టం స్పష్టంగా చెబుతోంది. కానీ ఈమధ్య కాలంలో పోలీసులు ఎవరినైనా అరెస్ట్ చేయగానే వారి ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేయడం లేదా ప్రెస్ మీట్‌లు పెట్టి మీడియాకు ఇవ్వడం ఒక అలవాటుగా మారిపోయింది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి జీవించే హక్కుతో పాటు గౌరవాన్ని, వ్యక్తిగత స్వేచ్ఛను ప్రసాదిస్తోంది. ఒక వ్యక్తిపై ఆరోపణలు వచ్చినంత మాత్రాన అతడి మానప్రాణాలు, గౌరవం పోయినట్లేనా అనే ప్రశ్నకు కోర్టులు కూడా అనేక సందర్భాల్లో స్పష్టత ఇచ్చాయి.

పరారీలో ఉన్న నేరస్థులైతే....

అసలు మన చట్టాల్లో పోలీసులు అరెస్ట్ అయిన నిందితుల ఫోటోలను ఇలా ప్రచారం చేయవచ్చని ఎక్కడా అనుమతులు లేవు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 84 ప్రకారం పరారీలో ఉన్న నేరస్థుల సమాచారం కోసం మాత్రమే నోటీసులు ఇచ్చే వెసులుబాటు కోర్టుల అనుమతితో ఉంటుంది. అంతేతప్ప సాధారణ విచారణ సమయంలో పోలీసులే స్వయంగా డిజిటల్ మీడియాలో ఫోటోలు విడుదల చేయడానికి ఎటువంటి చట్టపరమైన అధికారం లేదు. అయినా పాత కాలం నాటి పద్ధతులను కొనసాగిస్తూ సోషల్ మీడియాలో షేర్ చేయడంపై న్యాయ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతింటున్న కుటుంబ సంబంధాలు

ఒకవేళ విచారణ పూర్తయి, కోర్టులో ఆ వ్యక్తి నిర్దోషి అని తేలినా డిజిటల్ ప్రపంచంలో అతడికి జరిగిన నష్టం మాత్రం పూడ్చలేనిది. ఒకసారి ఇంటర్నెట్‌లో ఫోటోలు, వార్తలు వ్యాపిస్తే అవి ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతాయి. ఉద్యోగాలు రాకపోవడం, గుర్తింపు కోల్పోవడం, కుటుంబ సంబంధాలు దెబ్బతినడం వంటి దారుణమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే ఇంటర్నెట్‌లో ఒకసారి పడిన ఈ ముద్ర వల్ల కలిగే నష్టం శాశ్వతమైనది. ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్ హైకోర్టులు ఈ తరహా పోలీస్ ప్రచారాలపై తీవ్రంగా స్పందించాయి. అరెస్ట్ అయిన వ్యక్తుల ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టడం, మీడియా ముందుకు తీసుకురావడం చట్టవిరుద్ధమని ఆదేశాలు ఇచ్చాయి.

న్యాయస్థానం నోటీసులు...

ఈ అంశంపై ఇప్పుడు సుప్రీంకోర్టులో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి. అరెస్ట్ అయిన వ్యక్తుల ఫోటోలు, వివరాలు నెట్‌లో పెట్టడం వల్ల నిష్పాక్షికమైన విచారణ దెబ్బతింటుందని, ఇది 'ఫెయిర్ ట్రయల్' హక్కుకు విఘాతం కలిగిస్తుందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో పాటు సోషల్ మీడియా సంస్థలకు కూడా అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఒకే రకమైన నిబంధనలు లేదా ప్రోటోకాల్ తీసుకురావాలనే డిమాండ్ వినిపిస్తోంది.

"ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి"

అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో నిందితుల వివరాలు ఇచ్చేటప్పుడు 'ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి' అని మాత్రమే పేర్కొంటారు. మీడియా ట్రయల్స్ జరగకుండా, కోర్టు విచారణ ప్రభావితం కాకుండా చూస్తారు. మన దేశంలో కూడా దర్యాప్తుకు అత్యంత అవసరమైనప్పుడు తప్ప సాధారణ సమయాల్లో ఫోటోలు బయటకు వదలకుండా కఠిన నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. నేరాల నివారణకు, పరారీలో ఉన్న క్రిమినల్స్‌ను పట్టుకోవడానికి కొన్ని సందర్భాల్లో ఫోటోలు ప్రదర్శించడం అవసరమే కావచ్చు. కానీ ప్రతీ చిన్న కేసులోనూ అరెస్ట్ కాగానే ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రచారం కోసమే జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి.

జాతీయ విధానం తప్పనిసరి...

నేరం చేసిన వారికి శిక్ష పడాల్సిందే. కానీ న్యాయస్థానం నేరాన్ని నిర్ధారించే లోపే మీడియా, సోషల్ మీడియా వేదికగా విచారణ జరిపి తీర్పులు చెప్పేయడం సరైన పద్ధతి కాదు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత కూడా పోలీసు వ్యవస్థపై ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ విషయంలో స్పష్టమైన జాతీయ విధానం వస్తే తప్ప ఈ డిజిటల్ అవమానాలకు, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు అడ్డుకట్ట పడే అవకాశం లేదు. చట్టం తన పని తాను చేయాలి, నేరస్తులకు శిక్ష పడాలి. కానీ నేరం రుజువు కాకముందే ఒక వ్యక్తిని సమాజంలో నేరస్థుడిగా నిలబెట్టడం ఎంతవరకు న్యాయం?

గణేశుడి లడ్డు... కోటి రూపాయలు

కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ సంచలనం

ఒక లడ్డూ ధర ఎంత ఉంటుంది? వంద రూపాయలు, ఐదు వందలు లేదా మహా అయితే ఒక వెయ్యి అనుకుంటున్నారా? కానీ హైదరాబాద్‌లో ఓ వినాయక చవితి లడ్డూ ధర వింటే మీ మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే! కేవలం 5 కిలోల బరువున్న ప్రసాదం ఏకంగా ఒక కోటి ఒక్క లక్ష రూపాయలు పలికింది. అసలు ఒక లడ్డూకి అంత పెద్ద మొత్తంలో వేలం పాడాల్సిన అవసరం ఏమొచ్చింది? - సహనం వందే, హైదరాబాద్

- వేలం పాటలో దక్కించుకున్న నివాసులు
- పేదల కోసం ఖర్చు పెట్టాలని నిర్ణయం



హైదరాబాద్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపులో నిర్వహించే లడ్డూ వేలం పాటలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. బండ్లగూడ జాగీర్‌లోని కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో ప్రతి ఏటా ఈ కార్యక్రమం వైభవంగా జరుగుతుంది. ఈ ఏడాది కూడా ప్రసాదం కోసం విల్లా నివాసులంతా ఒక్కటై పాల్గొనడంతో తీవ్ర పోటీ నెలకొంది. చివరకు ఈ లడ్డూ ఏకంగా 1.01 కోట్ల రూపాయల రికార్డు ధరకు అమ్ముడై అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఒక్కరు కాదు... అందరూ కలిసి

సాధారణంగా వేలం పాట అనగానే ఎవరో ఒక బడా వ్యాపారో లేక రాజకీయ నాయకుడో దక్కించుకుంటారని అనుకుంటాం. కానీ ఇక్కడ విశేషం ఏంటంటే... ఈ ప్రసాదాన్ని ఏ ఒక్క వ్యక్తో సొంతంగా కొనలేదు. విల్లా యజమానులంతా ఒక బృందంగా ఏర్పడి, తమవంతు భాగస్వామ్యాన్ని అందిస్తూ ఈ మొత్తాన్ని వేలం పాడారు. వీరి ఐక్యతతో కూడిన భక్తిభావం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సామాజిక బాధ్యతే లక్ష్యం...

అయితే ఈ నిర్ణయం వెనుక కేవలం భక్తి మాత్రమే కాదు... ఒక గొప్ప సామాజిక బాధ్యత దాగి ఉంది. వేలం ద్వారా వచ్చిన ప్రతి పైసాను నిరుపేదలకు వైద్య సాయం అందించడానికి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు ఉపయోగించనున్నారు. అంటే ప్రసాదం ద్వారా దైవానుగ్రహంతో పాటు సమాజానికి మేలు చేసే మంచి సంప్రదాయం ఇక్కడ కొనసాగుతోంది.

ప్రజల నిబద్ధత... దానగుణం

గణేష్ ఉత్సవాల చరిత్రలో రిచ్‌మండ్ విల్లాస్ లడ్డూ వేలం ప్రతి సంవత్సరం వార్తల్లో నిలుస్తోంది. గతంలో కూడా ఇక్కడ భారీ ధరలు పలికి రికార్డులు సృష్టించాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఈ ప్రాధాన్యత ఇక్కడి ప్రజల నిబద్ధతను, దానగుణాన్ని ఎలుగెత్తి చాటుతోంది. దేవుడి ప్రసాదాన్ని ఒక పవిత్రమైన కార్యానికి వాడుకోవడం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. వేలంలో పాల్గొన్న నివాసుల ఉదారతను నగర ప్రజలంతా మెచ్చుకుంటున్నారు.

ప్రజల ఐక్యతకు నిదర్శనం...

ఒక లడ్డూ అంత ధర పలకడం ధన ప్రదర్శన కాదు... అది ఆ ప్రాంత ప్రజల ఐక్యతకు నిదర్శనం. ఈ సంప్రదాయం ఎందరో పేదలకు ఆసరాగా నిలుస్తూ మరిన్ని మంచి పనులకు బాటలు వేస్తుందని ఆశిద్దాం. కేవలం ఒక వేలం పాట ద్వారా కోట్ల రూపాయలు సేకరించి పేదలకు అండగా నిలవడం నిజంగా స్ఫూర్తిదాయకం.

అంబానీ కొడుకు అంతర్జాతీయ ప్రొఫెసర్

పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రహసనం

- బ్రిటన్‌లోని న్యూకాసిల్ వర్సిటీ నిర్వాకం
- వంతారా వివాదాలున్నా ఇవ్వడంపై విమర్శ
- ఆ దేశంలో విద్యార్థి సంఘాలు తీవ్ర నిరసన

పర్యావరణాన్ని కాపాడటం అంటే మీకేం గుర్తొస్తుంది? చెట్లు నాటడం లేదా ప్లాస్టిక్ వాడకం తగ్గించడమా? కానీ బ్రిటన్‌లోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయానికి మాత్రం ఆసియాలోనే నంబర్ వన్ కోటీశ్వరుడి కుమారుడు గుర్తొచ్చారు. ఏకంగా పర్యావరణ పరిరక్షణ ప్రొఫెసర్‌షిప్ గౌరవం ఆయనకు కట్టబెట్టారు. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇది నిజం. అసలు పర్యావరణానికి, ఈ కోటీశ్వరుడికి ఉన్న సంబంధం ఏంటి? విదేశీ వర్సిటీ తీసుకున్న ఈ వివాదాస్పద నిర్ణయం వెనుక ఉన్న మర్మం ఏమిటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. - సహనం వందే, లండన్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినందుకు... బ్రిటన్‌లోని న్యూకాసిల్ యూనివర్సిటీ ఇటీవల ఒక సంచలనాత్మక ప్రకటన చేసింది. భారతీయ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీకి 'సస్టెయినబిలిటీ ప్రాక్టీస్' విభాగంలో గౌరవ ప్రొఫెసర్‌షిప్ ఇస్తున్నట్లు వెల్లడించింది. పర్యావరణ పరిరక్షణ, జంతు సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవం ఇస్తున్నామని తెలిపింది. అయితే ఈ ప్రకటన వెలువడిన వెంటనే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

జంతువుల స్మగ్లింగ్... వంతారా వివాదం

అనంత్ అంబానీ భారతదేశంలో 'వంతారా' పేరుతో భారీ జంతు సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్ ప్రారంభం నుండి అనేక వివాదాల్లో చిక్కుకుంది. జంతువుల స్మగ్లింగ్, నిబంధనలకు విరుద్ధంగా విదేశాల నుండి వన్యప్రాణులను తెచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడ జంతువులను సహజసిద్ధమైన అడవుల్లో ఉంచకుండా ప్రదర్శన వస్తువులుగా మార్చారనే విమర్శలు ఉన్నాయి. ఏనుగులు, పులులు వంటి వన్యప్రాణులను అక్రమంగా తరలించారనే వార్తలు వచ్చాయి. ఈ సందేహాలు నివృత్తి కాకముందే వర్సిటీ అతనికి ఈ పదవి ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశం ఏంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు.

బ్రిటన్‌లో విద్యార్థి సంఘాలు తీవ్ర నిరసన

న్యూకాసిల్ విశ్వవిద్యాలయం నిర్ణయంపై బ్రిటన్‌లోని పర్యావరణవేత్తలు, విద్యార్థి సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. వర్సిటీలు తమ ఆర్థిక ప్రయోజనాలు, విరాళాల కోసం ఇలాంటి హోదాలను అమ్ముకుంటున్నాయని ఆరోపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పోరాడుతున్న వారిని పదిలేసి,సంపన్న కుటుంబాల వ్యక్తులకు పదవులు ఇవ్వడం వల్ల విశ్వవిద్యాలయ ప్రతిష్ట దెబ్బతింటుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

కాలుష్యాన్ని పెంచే సంస్థల ప్రతినిధికా?

అంబానీ కుటుంబానికి చెందిన రిలయన్స్ సంస్థలు ప్రపంచంలోనే అతిపెద్ద పెట్రోకెమికల్ రిఫైనరీలలో ఒకదాన్ని నడుపుతున్నాయి. శిలాజ ఇంధనాల వ్యాపారం ద్వారా కాలుష్యాన్ని పెంచే సంస్థల ప్రతినిధికి ఈ ప్రొఫెసర్‌షిప్ ఇవ్వడం ప్రధాన ప్రశ్నగా మారింది. పర్యావరణ నాశనానికి కారణమయ్యే వ్యాపారాలు చేస్తూ, పర్యావరణ ప్రేమికుడిగా చెలామణి అవ్వడాన్ని 'గ్రీన్ వాషింగ్' అంటారు. అంటే తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఆడే నాటకం అన్నమాట.

భారీ విరాళాల కోసమేనా?

సాధారణంగా విశ్వవిద్యాలయాలు పరిశోధనల నిధుల కోసం బడా పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తుంటాయి. అనంత్ అంబానీకి ఈ గౌరవం వెనుక భారీ విరాళాల ఆశ ఉండి ఉంటుందని అనుమానిస్తున్నారు. విద్యాసంస్థలు నైతిక విలువలను పక్కనపెట్టి డబ్బుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని బ్రిటన్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. దీనివల్ల నిజమైన పర్యావరణ పరిశోధకులకు అన్యాయం జరుగుతోంది. అయితే దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు నిరసనలకు సిద్ధమవుతున్నారు.

డబ్బుంటే ఏదైనా కొనవచ్చా?

పర్యావరణ పరిరక్షణ అనేది మాటల్లోనో,అవార్డుల్లోనో చూపించేది కాదు. ప్రకృతికి హాని కలిగించకుండా వ్యాపారాలు చేయడం, జంతువుల సహజ నివాసాలను కాపాడటం అసలైన పరిరక్షణ. కానీ గ్రీన్ వాషింగ్ ద్వారా కాలుష్య వ్యాపారాలను దాచిపెట్టి, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవడానికి కార్పొరేట్ దిగ్గజాలు ఇలాంటి మార్గాలను ఎంచుకుంటున్నారు. డబ్బుతో ఏదైనా కొనవచ్చనే ధోరణి పెరుగుతున్న రోజుల్లో విద్యాసంస్థలు కూడా మినహాయింపు కాదనడానికి ఇదొక ఉదాహరణ. నిజమైన సేవకు గుర్తింపు దక్కాలా? లేక ధన బలానికి ప్రాధాన్యమివ్వాలా?